గెడ్డలు ఘోరం

16, 23 వార్డుల్లో అధ్వానంగా పారిశుధ్యం

ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త, మురుగు

ఎప్పటికప్పుడు తొలగించని పారిశుధ్య సిబ్బంది

దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



ఇసుకతోట రజక వీధి గెడ్డలో పేరుకుపోయిన చెత్త

మద్దిలపాలెం: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ **తీరు అధ్వానంగా** తయారైంది. కూటమి ప్రభుత్వం **అధికారంలోకి** వచ్చాక పాలన అస్తవ్యస్తంగా **మారింది. వార్డుల్లో** ప్రధానంగా పారిశుధ్యం పడకే**సింది. ఇంటింటా** చెత్త సేకరణ, డ్రెయిన్లలో వ్యర్థాల **తొలగింపు,** గెడ్డల శుభ్రత పూర్తి స్థాయిలో **జరగడం లేదు.** పారిశుధ్య నిర్వహణపై **ఉన్నతాధికారులు,** ప్రజాప్రతినిధులు దృష్టి సారించ**క పోవడంతో** స్థానిక ప్రజలు వ్యాధుల **భయంతో** ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డల శుభ్రత గాలికి..

జీవీఎంసీ 16, 23 వార్డుల్లో **ఏ** గెడ్డను చూసినా వ్యర్థాలు పేరు**కు**పోయి రోత పుట్టిస్తోంది. 23**వ** వార్డు మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీలోని గెడ్డలో సక్రమం**గా** పూడికలు తొలగించకపోవడం**తో** పెద్ద ఎత్తున చెత్త, మురుగు నిల్వ **ఉం**డిపోయి దుర్వాసన వెలువడు**తోంది. గెడ్డ** రక్షణ గోడ శిథిలమైంది. 16వ **వార్డులోని పలు** ప్రాంతాల్లో గల గెడ్డల శుభ్రత**ను గాలికొదిలేశారు.** ఇసుకతోట, రజక వీధి, **అంబేద్కర్ కాలనీల** మీదుగా ప్రవహిస్తున్న గెడ్డలో పెద్ద ఎత్తున చెత్తాచెదారం, పాలిథిన్ కవర్లతో వ్యర్థాలు పేరుకుపోయాయి.

దోమలు, ఈగల బెడద

గెడ్డలోని పూడికలు సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసనతోపాటు దోమలు, ఈగల బెడద ఎక్కువైందని స్థానిక మహిళలు వాపోతున్నారు. పగలూ రాత్రి అనే తేడా లేకుండా దోమలు దాడి చేస్తూ ఆందోళన కలిగిస్తున్నాయని ఇసుకతోట రజక వీధి, అంబేద్కర్ నగర్ కాలనీల్లో గెడ్డ అంచున నివసిస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషజ్వరాల బారిన పడకుండా దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



భానునగర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

అరకొరగా చెత్త సేకరణ

కాలువలు, గెడ్డ**ల్లో** పేరుకుపోతున్న చెత్తను చూస్తుం**టే** ఇంటింటా చెత్త **సేక**రణ సక్రమంగా **అమల**వుతుందా అనే **సందేహం** కలుగుతోంది. **చెత్త సేకరణ** వాహనం వెళ్లే మా**ర్గాల్లో తప్ప, చిన్న** చిన్న సందులు, బ**హుళ అంతస్తుల భవనాల్లో** ఇంటింటా చెత్త సేకరణ సరిగా జరగడం లేదని తెలుస్తోంది. దీంతో ఇంట్లోని చెత్త, వ్యర్థాలను **పాలిథిన్ బ్యాగుల్లో వేసి డ్రెయిన్లు,** గెడ్డల్లో పడేస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోంది. గెడ్డల్లో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి గెడ్డల శుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని 16, 23 వార్డుల ప్రజలు కోరుతున్నారు.



అంబేద్కర్ కాలనీ గెడ్డలో పూడిక

దుర్వాసన, దోమలతో సతమతం

కేఆర్ఎం కాలనీ నుంచి సీఎంఆర్ శ్మశానవాటిక మీదుగా భానునగర్, ఇసుకతోట రజక వీధి, అంబేద్కర్ కాలనీ నుంచి ఇసుకతోట వరకు ప్రవహిస్తున్న గెడ్డకు ఆనుకొని వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇళ్లల్లోని వ్యర్థాలను పాలిథిన్ సంచుల్లో వేసి గెడ్డలో పడవేస్తున్నారు. ఎక్కడెక్కడో డ్రెయిన్లలో పడేసిన చెత్త గెడ్డలోకి కొట్టుకొస్తోంది. దుర్వాసన, దోమలు పెరిగిపోయి ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం.

– ఎం.కృష్ణమోహన్, కేఆర్ఎం కాలనీ

గెడ్డలు శుభ్రం చేయాలి

మా ప్రాంతంలోని గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం **చే**యాలి. పూడికలు తక్షణం తొలగించాలి. గెడ్డలో చెత్త **పే**రుకుపోవడం వల్ల దుర్వాసన, దోమలతో ఇబ్బంది **ప**డుతున్నాం. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గెడ్డల్లో చెత్త వేయకుండా మెస్ ఏర్పాటు చేసేలా **అ**ధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎం.మురళీకృష్ణ, ఇసుకతోట

క్షయపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సెంటర్ ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీపీకాలనీ: వరల్డ్ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక హెల్త్ సెంటర్ల ఉద్యోగులతో పాటు సెక్టార్–9 జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రెండు వారాలకు పైబడి పొడి దగ్గు ఉన్న వారు స్థానిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంటువ్యాధి క్షయ సోకిన వారి కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 బైక్‌ల సీజ్



ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

బీచ్‌రోడ్డు: ట్రాఫిక్ నిబంధనలు పాటించని 20 మంది ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మూడో పట్టణ పీఎస్ పరిధిలో శనివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల్లో 20 మంది వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు మీరినట్లు గుర్తించి వారికి జరిమానా విధించడంతోపాటు టూ వీలర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఏయూ నూతన వీసీ



ఆచార్య రాజశేఖర్‌కు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని శనివారం ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు. ఏయూ వీసీగా రావడం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అనుగ్రహంగా భావిస్తానని, అందరి ఆశీస్సులతో ఏయూ అభివృద్ధికి కృషి చేస్తానని ఆచార్య రాజశేఖర్ తెలిపారు. కాగా.. వీసీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి సింహాచలం వచ్చిన ఆచార్య రాజశేఖర్‌కు అడవివరం గ్రామస్తులు, ఆయన స్నేహితులు, సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. రాజశేఖర్ సొంత గ్రామం అడవివరం. అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, వై.డి.వి.ప్రసాద్, రాజనాల సత్తిబాబు, గ్రామస్తులు బుస్నీ, ఎస్.అప్పారావు తదితరులు ఆచార్య రాజశేఖర్ వెంట ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వర్సిటీ ఆచార్యులను పలకరిస్తున్న ఏయూ నూతన వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్(వీసీ)గా జి.పి.రాజశేఖర్ శనివారం బాధ్యతలు తీసుకున్న అనంతరం సెనేట్ హాల్‌లో ఏయూ ఆచార్యులంతా మర్యాదపూర్వక కలయిక ఏర్పాట్లు చేశారు. వేదికపై వీసీతోపాటు రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయ రావు, రెక్టార్ కిషోర్‌బాబు ఆశీనులయ్యారు. ఆచార్యులంతా వరుస క్రమంలో వీసీ ఉన్న చోటకు వచ్చి, నమస్కరించి శుభాకాంక్షలు చెబుతూ ముందుకు సాగారు. ఈ క్రమంలో వచ్చిన ప్రతి ఒక్క ప్రొఫెసర్‌కు వీసీ రాజశేఖర్ నమస్కరించి.. చాక్లెట్ తీసుకోండి అంటూ ఆప్యాయంగా పలకరించారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 25 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలకు 25 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.పద్మావతి తెలిపారు. కేంద్రంలో 535 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 25 మంది గైర్హాజరు కావడంతో 510 మంది పరీక్ష రాశారన్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 105 మందికి ఆరుగురు గైర్హాజరు కాగా.. 99 మంది పరీక్ష రాశారన్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 430 మంది హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరుతో 411 పరీక్ష రాసినట్లు చెప్పారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను శనివారం ఓ ప్రైవేట్ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ నిర్వాహకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి వివరించారు. విద్యార్థులు పార్కులోని మొక్కలను తిలకించి సందడి చేశారు.

రెండు షాపులపై కేసు

సీతమ్మధార: నగరంలోని సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లోని స్వీట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో శనివారం జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవింద, తహసీల్దార్ ఎం.రమేష్ తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

సివిల్స్‌లోనూ రాణించండి.. దేశానికి సేవలందించండి



పినాకిల్–2025 వివరాలతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులతో సీపీ శంఖబ్రత బాగ్చి

ఎంవీపీకాలనీ: మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌పైనా ఆసక్తి చూపి రాణించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన పినాకిల్–2025 మేనేజ్‌మెంట్ మీట్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీపీ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో నైపుణ్యంతోపాటు లీడర్‌షిప్, వ్యూహరచనలతో కూడిన నిర్ణయాలు తీసుకునే చొరవ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సివిల్స్‌లోనూ రాణించి దేశానికి, సమాజానికి సేవలందించాలని కోరారు. ఐఐఏఎం డీన్ డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. ఆ దిశగానే వారి కలలు ఉండాలని, వాటి సాకారానికి అహర్నిశలు శ్రమించాలని సూచించారు. అనంతరం పినాకిల్–2025 వివరాలతో కూడిన సావనీర్‌ను సీపీ బాగ్చితోపాటు అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన కల్చరల్ మీట్ ఉత్సాహం జరిగింది. ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య రామకృష్ణారావు, ఐఐఏఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, సూర్యతేజ, డాక్టర్ విజయ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీతారామ సేవా సంఘం ఎన్నికలు నేడు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెంలో శ్రీ సీతారామ సేవా సంఘం 2025–26 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికల కోలాహలం నెలకొంది. సంఘంలో గవర కులస్తులు మాత్రమే పోటీ చేసే కార్యవర్గ ఎన్నిక ఈ ఏడాది ఓటింగ్ పద్ధతిలో జరగనుంది. సంఘంలో మొత్తం 124 ఓట్లు ఉండగా.. అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ పడుతున్నారు. ఆదివారం ఉదయం రామాలయం వద్ద ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి నరేంద్రకుమార్ శనివారం తెలిపారు. తమ గ్రామంలో చాలా దశాబ్దాల తరువాత ఓటు వేసి ఎన్నుకునే ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ ప్రక్రియపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, ఓటర్లంతా నిర్ణీత సమయంలో వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సచివాలయం సిబ్బందికి కలెక్టర్ హెచ్చరిక



విశాలాక్షినగర్ సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సచివాలయం సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ హెచ్చరించారు. విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లోని 88, 89 నంబర్ల సచివాలయాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, విధుల నిర్వహణ, హాజరు పట్టీ, ప్రజలు నుంచి వచ్చిన వినతుల పట్ల స్పందన తదితర అంశాలపై ఆరా తీశారు.ప్రజలు నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరిస్తున్నారా లేదా? ఉద్దేశపూర్వకంగా ఆ వినతులను పక్కనపెడుతున్నారా? తదితర వాటి గురించి తెలుసుకున్నారు. అక్కడ సిబ్బందితో కంప్యూటర్‌లో వారి లాగిన్ తెరిపించారు. అందులో నమోదు చేసిన వినతులు, పరిష్కరించిన సమస్యలు పరిశీలించారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయకపోవడం, సర్వేలు నిర్వహించడం తదితర అంశాల్లో సిబ్బంది వెనుకబడి ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. అన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ ప్రజలకు సేవలు అందించడంలో ఎందుకు వెనుకబడుతున్నారని సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరూ సమయపాలన పాటించి ప్రజలతో సఖ్యతగా ఉండాలన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పక్కాగా చేపట్టాలని, సర్వేలు పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జీవీఎంసీ జోనల్ కమిషనర్(ఇన్‌చార్జి) కనకమహాలక్ష్మి ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా విద్యార్థులు ఎదగాలి

బీచ్‌రోడ్డు: సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా ప్రాంగణంలో ఇస్కాన్ అనుబంధ విద్యా సంస్థ డివైన్ టచ్ పాఠశాల 14వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల మనస్తత్వాన్ని గ్రహించి తద్వారా వారిని ఆప్యాయత, ప్రేమతో పెంచి దేశం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవాటు చేసుకుని నీతి, నిజాయితీగా జీవిస్తూ ఉత్తములుగా మెలగాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితుడు కెనడాకు చెందిన ఇస్కాన్ ప్రతినిధి భక్తి మార్గ్ స్వామి మహరాజ్ విద్యార్థులకు హరే కృష్ణ మహా మంత్రంతో ప్రసంగించి ఆశీస్సులు అందజేశారు. డివైన్ టచ్ స్కూల్ ప్రిన్సిపాల్ నేహాదాస్, ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ తదితరులు ప్రసంగించారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేయగా.. పాఠశాల ప్రతినిధి ప్రసన్న వందన సమర్పణ చేశారు. డివైన్ టచ్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల 27 సాంస్కృతిక అంశాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థినుల ప్రతిభ



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: రాంనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాల (మహిళా ప్రాంగణం) విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ చూపారు. కళాశాల ప్రాంగణంలో శనివారం ఇన్ఫోసిస్ (ఐటీ)నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను ఆయన అభినందించారు. తమ విద్యార్థినులకు డిగ్రీతో పాటు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి, నోడల్ అకడమిక్ ఆఫీసర్ ఎస్. వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. హిమశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి ఎం. బ్యూల, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం కొత్త మార్గాన్ని నిర్దేశించేదే భగవద్గీత



ప్రవచిస్తున్న స్వామి పరిపూర్ణానంద

మద్దిలపాలెం: నిత్యం కొత్త మార్గాన్ని నిర్దేశించేదే భగవద్గీత అని, ఎప్పుడూ విన్నదే అయినా ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుందని పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో స్వామి వారిచే 'సాధన రహస్యం' అనే అంశంపై శనివారం మొదటి రోజు ప్రవచన కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి రోజూ సూర్యోదయం ఎలా జరుగుతుందో.. అదే విధంగా మనకు జ్ఞానోదయం కూడా జరగాలని స్వామీజీ ప్రవచించారు. మానవత్వం నుంచి దైవత్వానికి సాగే ప్రయాణమే భగవద్గీత లక్ష్యమని చెప్పారు. ఈ క్రమంలో భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడి స్థాయి, అద్వైత సిద్ధాంతాన్ని బోధించిన ఆదిశంకరుల స్థాయి, ఉపదేశ సారం అందించిన రమణ మహర్షి స్థాయి మహోన్నతమైనవని పేర్కొన్నారు. ఆలోచనా సరళి, ఈనాడు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న మనకు ఎలా సరిపడతాయో చెప్పేందుకే ఈ మూడు రోజుల ప్రవచన కార్యక్రమ ఉద్దేశ్యమని చెప్పారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజు, కళాభారతి సెక్రటరీ డాక్టర్ జి.ఆర్.కె.రాంబాబు, వైద్యులు చిట్టి పంతులు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు.

కారు ఢీకొని మహిళ మృతి



సావిత్రి(ఫైల్)

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఆనందపురానికి చెందిన గడ్డం సావిత్రి(60) అనే మహిళ శ్రీకృష్ణాపురం ఎదురుగా ఎస్ఎస్ఎస్ నగర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి శనివారం సాయంత్రం బయలుదేరింది. శ్రీకృష్ణాపురం వద్ద ఆటో దిగి అక్కడ బీఆర్‌టీఎస్ రోడ్డు కూడలి దాటుతుండగా.. అదే సమయంలో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. వెంటనే ఆ కారు డ్రైవర్ యూటర్న్ తీసుకొని తిరిగి సింహాచలం వైపు వెళ్లిపోయాడు. ఆ కారు నంబర్‌ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సావిత్రి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. స్థానికులు గుర్తించిన కారు నంబర్ సహాయంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతురాలు సావిత్రి భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు.



ఘటనా స్థలంలో సావిత్రి మృతదేహం

బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి

ఎంవీపీకాలనీ: అల్లూరి సీతారామరాజు జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్‌పీఎఫ్) సమావేశాన్ని శనివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహించారు. గతేడాది కాలంలో బాలల హక్కుల పరిరక్షణకు చేసిన కృషి, సేవలను ఫోరం ప్రతినిధులు నివేదించారు. ప్రస్తుతం బాలల హక్కుల పరిరక్షణలో ఎదురవుతున్న సవాళ్లు, మరిన్ని సేవల దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం నిర్వహించే కార్యక్రమాలకు గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు ఫోరం ప్రతినిధులు కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్తంగా బాలల హక్కుల పరిరక్షణకు రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి శోభన్‌కుమార్‌ను ఫోరం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఇరు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంఘ కార్యదర్శి శోభన్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

మహిళా పోలీసులకు ఉచిత వైద్య సేవలు

విశాఖ సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో డీసీపీ(క్రైమ్) లతామాధురి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కల్యాణ మండపంలో అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 220 మంది మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్షలు చేసుకున్నారు. వీరికి అవసరమైన మందులు అందజేశారు.



డీసీపీ(క్రైమ్) లతా మాధురికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని విజయగణపతి స్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రుత్విక్ వరుణ నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, మూత మంత్ర జపం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

నేడు విజయగణపతి కల్యాణం

వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గణపతి పూజతో ప్రారంభించి కలశ అభిషేకం చేస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి విజయగణపతి స్వామి, సిద్ధి, బుద్ధి కల్యాణం నిర్వహిస్తారు. స్థానిక భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించాలని నిర్వాహకులు కోరారు.